ప్రజాశక్తి
శనివారం 6 డిసెంబర్ 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై చర్చ!

- 10 జిల్లాల్లో 21,880 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరణ
- 2032 నాటికి 120 బిలియన్లు, 2047 నాటికి 1.0 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నేల విడిచి సాము' చెయ్యడం అంటే ఇదేనేమో. దీర్ఘకాలిక ప్రణాళికలు నిర్ణయించుకోవడాన్ని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. అయితే అందుకు అవకాశాలతో పాటు ప్రభుత్వాలు తీసుకునే ఆర్థిక, పారిశ్రామిక విధానం అత్యంత కీలకమైనదన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. మరో రకంగా చూస్తే ఏ పార్టీ ప్రభుత్వానికైనా ప్రజలు అధికారం ఇచ్చేది 5ఏళ్లకే. కానీ 2047 వరకూ కూటమి ప్రభుత్వం ఆరాటం ఇక్కడ కనిపిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సహా కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు చెబుతున్న ప్రకారం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, మన్యం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలతో కలిపి మొత్తం 21,880 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఎకనమిక్ రీజియన్ ప్రాజెక్టుకు ప్రతిపాదించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ముఖ్య కార్యనిర్వహక అధికారి డాక్టర్ ఎన్.యువరాజ్ (ఐఎఎస్) సారథ్యంలో శుక్రవారం విఎంఆర్‌డిఎలో జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ సహా, విఎంఆర్‌డిఎ, జివిఎంసి కమిషనర్లు, ఇతర శాఖల ఉన్నతాధికారులు ఈ రీజియన్‌పై కీలక చర్చ చేశారు. ప్రభుత్వం చెబుతున్న క్రారం 2032 నాటికి ఈ ప్రాంతం 120 బిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 1.0 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం ద్వారా ఏపి 2.40 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు.

విశాఖ రీజియన్‌ను 'గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్'గా మార్చడమే లక్ష్యం...

పోర్టుల ద్వారా వాణిజ్యాన్ని ప్రోత్సహించడం, ఐటి హబ్స్, ఇన్నోవేషన్ సెంటర్ల అభివృద్ధి, వ్యవసాయం, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, పెద్ద ఎత్తున పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, రహదారుల నిర్మాణం, రైల్వే పోర్టుల కనెక్టివిటీ వంటి అంశాలు దీంట్లో ఉన్నాయి. ఏకంగా ఈ ప్రాంతాన్ని 'గ్లోబల్ ఎకనామిక్ పవర్ హౌస్'గా అభివృద్ధి చేసెయ్యాలంటూ ప్రభుత్వం కళలు కంటోంది. సుమారు 100 నుంచి 150 బిలియన్ పెట్టుబడులను ఆకర్షించడం దీంట్లో ఒక ప్రధాన లక్ష్యంగా ఉంది. తద్వారా 20లక్షల ఉద్యోగాలు యువతకు ఇస్తారని చర్చల ద్వారా వెల్లడవుతోంది. వాస్తవానికి విశాఖపట్నం ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ ముఖ్యంగా పోర్టులు, భారీ పరిశ్రమలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్‌లు), సేవారంగం, మత్స్యసంపద ఎగుమతులపై ఆధారపడి ఉంది.

వాస్తవాలతో నిమిత్తంలేకుండా చర్చ..

బిలియన్, ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఏ ప్రాంతాలైనా రూపుదిద్దుకోవాలంటే

మిగతా 2లో..

వార్త 5లో...

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

విమాన సర్వీసుల్లో అంతరాయం

పలు విమానాలు రద్దు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : దేశవ్యాప్తంగా విమానయాన సంస్థ ఇండిగోలో తలెత్తిన సాంకేతిక, నిర్వహణా లోపాల కారణంగా విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి రాకపోకలు సాగించే పలు సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. విమానాశ్రయం అధికారుల సమాచారం ప్రకారం, గురువారం శుక్రవారం విశాఖపట్నం నుండి బయలుదేరే 15 విమానాలు రద్దయ్యాయి. ప్రధానంగా 307-విశాఖపట్నం - హైదరాబాద్, 218-విశాఖపట్నం - బెంగళూరు, 1444-విశాఖపట్నం - అబుదాభి, 6645-విశాఖపట్నం హైదరాబాద్, 783-విశాఖపట్నం - హైదరాబాద్, 6089-విశాఖపట్నం - చెన్నై, 2772-విశాఖపట్నం - బెంగళూరు, 779-విశాఖపట్నం - హైదరాబాద్, 216-విశాఖపట్నం - హైదరాబాద్, 617-విశాఖపట్నం - కోల్‌కత్తా, 883-విశాఖపట్నం - హైదరాబాద్, 6680-

మిగతా 2లో..

స్మార్ట్ మీటర్లు బిగింపు నిలిపేయాలి : వార్వా, నివాస్

వార్త మెయిన్ 6లో..

విశాఖ వేదికగా జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలు

వార్త 2లో..

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వార్త మెయిన్6లో..

క్రికెట్ బ్లాక్ టికెట్ల దందా

- 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వార్త 3లో..

పాయకరావుపేటలో విద్యార్థులతో హోంమంత్రి అనిత

ఘనంగా పేరెంట్, టీచర్ సమావేశాలు

వార్త 7లో..

విశాఖలో క్రికెట్ ఫీవర్

- నేడు సఫారీలతో భారత్ చివరి వన్డే
- సీరీస్ నిర్ణయాత్మక పోరుకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న మూడు వన్డేల సిరీస్ ఉత్కంఠభరితమైన క్లైమాక్స్‌కు చేరుకుంది. ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలిచి సిరీస్‌లో సమంగా నిలబడ్డాయి. సిరీస్ విజేతను నిర్ణయించే చివరి వన్డేకు ఎసిఎ- విడిసిఎ స్టేడియం వేదిక కానుంది. శనివారం మధ్యాహ్నం 1:30 గంటలకు ఈ నిర్ణయాత్మక పోరు ప్రారంభం కానుంది.

ఇరు జట్ల ప్రాక్టీస్

భారత్, దక్షిణాఫ్రికా జట్లు రెండూ ఇప్పటికే విశాఖపట్నం చేరుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఇరు జట్లు ఎసిఎ- విడిసిఎ స్టేడియంలో ఉత్సాహంగా ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొన్నాయి. ముఖ్యంగా సిరీస్ విజేతను నిర్ణయించే మ్యాచ్ కావడంతో, ఇరు జట్ల ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు.

విజయంపై ధీమా వ్యక్తం చేసిన ఇరు జట్లు

మ్యాచ్‌కు ముందు జరిగిన మీడియా సమావేశాల్లో ఇరు జట్ల సారథులు కీలక విషయాలు పంచుకున్నారు. భారత కెప్టెన్ ఈ సిరీస్‌ను గెలవడంపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. "సిరీస్‌లో చివరి మ్యాచ్ ఎప్పుడూ ముఖ్యమైందే. మా జట్టులోని యువ ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి బాగా ఆడారు. దక్షిణాఫ్రికా బలమైన జట్టు, విశాఖ అభిమానుల మద్దతుతో సిరీస్‌ను కైవసం చేసుకుంటాం' అనే నమ్మకం ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని పేర్కొన్నారు.

నెట్ ప్రాక్టీస్ చేస్తున్న ఆటగాళ్లు

దక్షిణాఫ్రికా కెప్టెన్ మాట్లాడుతూ, తమ జట్టు రెండో వన్డేలో గెలిచిన ఆత్మవిశ్వాసాన్ని ఈ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తామని తెలిపారు. ఇది సిరీస్ డిసైడర్ మ్యాచ్. అన్ని విభాగాల్లో సమష్టిగా రాణించాలని అనుకుంటున్నాం.

వర్షం ముప్పు

శనివారం మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై చర్చ!

ఆ ప్రాంత భౌగోళిక, ఆర్థిక, పారిశ్రామిక స్థితిగతుల అధ్యయనం అత్యంత ముఖ్యమైనది. విశాఖ ముఖద్వారంగా అభివృద్ధి కావాల్సిన 10 జిల్లాల ఎకనమిక్ రీజియన్‌లో ప్రస్తుత భౌతిక పరిస్థితులను పాలకులు పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్, విశాఖ పోర్టు, హిందుస్థాన్ షిప్‌యార్డ్ వంటివి ఆర్థికంగా, వర్కర్ల పరంగా బలహీనపడుతూనే ఉన్నాయి. పాలకుల ప్రైవేటీకరణ, కార్పొరేట్లకు కట్టబెట్టే విధానంతో నష్టపోతూ ఆర్థిక రంగం, సేవారంగాన్ని కుదేలు చేస్తున్న సంగతి కాదనలేని సత్యం. తాజాగా మునుపెన్నడూలేని రీతిలో రూపాయి విలువ భారీ పతనం అవుతోంది. 2014లో డాలర్‌తో పోల్చినప్పుడు మన రూపాయి విలువ రూ.62లు ఉండగా నేడు రూ.90కు చేరింది. అంటే రూ.90 ఇస్తే గానీ మనం ఒక డాలర్‌తో సరితూగలేమన్నమాట. మన దేశం విదేశాల నుంచి దిగుమతులపై ముఖ్యంగా ముడిచమురును డాలర్లలోనే తెచ్చుకోవాలి. దీంతో భారీ స్థాయిలో రూ.లక్షల కోట్లు వెచ్చించాల్సిన గత్యంతరం ఏర్పడబోతుంది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోనుంది. కొత్త ఉద్యోగాలు రానేరావు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ భారాలన్నీ ప్రజలపైనే పడతాయి. డాలర్ విలువ తగ్గుతుందన్న గ్యారెంటీయే లేదు. అలాంటప్పుడు బిలియన్, ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ సాధ్యమా? వ్యవసాయ రంగం దెబ్బతిని ఉపాధికి గ్యారెంటీ ఇక్కడ లేదు. ఆర్థిక వ్యవస్థ బాగుపడాలంటే స్థిరమైన పునాది ప్రభుత్వ రంగాన్ని నిలబెట్టే విధానం తీసుకొని కార్పొరేట్లకు ఊడిగం చేసే పాలకుల తీరు మారకపోతే విశాఖ ఎకనమిక్ రీజియన్ లక్ష్యాలు నెరవేరతాయనుకోవడం అత్యాశే అవుతుంది. నెలవిడిచి సాముచేయడం కాగలదనడంలో ఎలాంటి సందేహం లేదు.

విశాఖలో క్రికెట్ ఫీవర్

విశాఖ నగరంలో వాతావరణంపై అభిమానుల్లో ఆందోళన నెలకొంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మ్యాచ్ రోజున సాయంత్రం సమయంలో వర్షం పడే అవకాశం కొంతవరకు ఉన్నట్లు సమాచారం. అయితే, ఈ ముప్పు ఎక్కువగా ఉండకపోవచ్చని, మ్యాచ్ సాఫీగా జరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వర్షం అంతరాయం కలిగించినా, త్వరగా అవుట్‌ఫీల్డ్‌ను సిద్ధం చేయడానికి ఏసిఏ అన్ని చర్యలు తీసుకుంటోంది.

టికెట్లు హాట్ కేకుల్లా విక్రయం

భారత్-దక్షిణాఫ్రికా మధ్య సిరీస్ డిసైడర్ అయిన మూడో వన్డే విశాఖపట్నంలో క్రికెట్ ఉత్సాహాన్ని పతాక స్థాయికి చేర్చింది. టీమ్ ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మొదటి రెండు వన్డేల్లోనూ (రాంచీ, రాయ్‌పూర్‌లలో) వరుసగా సెంచరీలు చేయడంతో, విశాఖ మ్యాచ్‌కు డిమాండ్ అమాంతం పెరిగింది. కోహ్లీ ఫామ్, అలాగే విశాఖలో ఆయనకు ఉన్న అద్భుతమైన రికార్డు (సగటు 97.83) కారణంగా, అభిమానులు అతడి బ్యాటింగ్‌ను ప్రత్యక్షంగా చూడాలని ఉవ్విళ్లూరుతున్నారు. కోహ్లీ సెంచరీ తర్వాత, టికెట్ల రెండు, మూడు విడతల్లో నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా అమ్ముడయ్యాయి. ఏసిఏ అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన రావడంతో, స్టేడియం సామర్థ్యం మేరకు టికెట్లన్నీ (రూ.1,200 నుండి రూ.18,000 వరకు వివిధ ధరల్లో) పూర్తిగా అమ్ముడయ్యాయి.

ఏర్పాట్లను పరిశీలించిన ఎసిఎ అధ్యక్ష, కార్యదర్శులు

ఏసిఏ -విడిసిఏ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ), పోలీస్ యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. మ్యాచ్ నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను ఏసిఏ అధ్యక్షులు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సానా సతీష్ స్వయంగా పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. వివిఐపి, వివిఐపి గ్యాలరీలు, ప్రముఖుల రాకపోకలు, వారి భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

కట్టుదిట్టమైన పోలీసు భద్రత

విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మ్యాచ్ రోజున దాదాపు 1,500 మందికిపైగా పోలీసు సిబ్బందిని స్టేడియం పరిసరాలలో మోహరించనున్నారు. స్టేడియం లోపల, ప్రవేశ ద్వారాల వద్ద, పార్కింగ్ ప్రదేశాలలో బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా స్టేడియం మొత్తం నిఘా ఉంచనున్నారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై దృష్టి పెట్టడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రేక్షకులు మొబైల్ ఫోన్లు, పర్సులు మినహా ఇతర వస్తువులు (వాటర్ బాటిల్స్, బ్యాగులు, ఆహార పదార్థాలు) తీసుకురాకుండా కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు.

విమాన సర్వీసుల్లో అంతరాయం

విశాఖపట్నం - ఢిల్లీ, 6286-విశాఖపట్నం - హైదరాబాద్, 6585-విశాఖపట్నం -ముంబాయి, 7063-విశాఖపట్నం - తిరుపతి విమానాల రద్దు కారణంగా ఈ మార్గాలలో ప్రయాణించాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇండిగో సంస్థ ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు లేదా పూర్తి టికెట్ డబ్బులు వెనక్కి చెల్లించే ప్రక్రియను చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

విశాఖ వేదికగా జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలు

- 11 విభాగాలుగా నిర్వహణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రతిష్టాత్మకమైన 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు విశాఖ వేదికగా ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15వ తేదీ వరకు ఈ పోటీలకు విశాఖ నగరం ఆతిథ్యం ఇస్తున్నట్లు ఏపి రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు జె.సుధాకరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం బీచ్‌రోడ్డులోని విఎంఆర్‌డిఎ పార్కులో స్కేటింగ్ రింక్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ వరకు 10 రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. 11 విభాగాలలో జరిగే పోటీలకు 4000 మంది స్కేటర్లు పాల్గొంటారని తెలిపారు. ఏపి రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ థామస్ చౌదరి మాట్లాడుతూ, విశాఖ నగరంలో మూడు ప్రాంతాలలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉడాపార్క్, శివాజీ పార్క్, కైలాసగిరి, బోయపాలెం స్కేటింగ్ రింక్‌లలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ఐ జనరల్ సెక్రటరీ డాక్టర్ డి.భగీరథ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు యార్లగడ్డ రవి, శీలం లక్ష్మణ్ తదితరులు ప్రసంగించారు.

సమావేశంలో మాట్లాడుతున్న రోలర్ స్కేటింగ్ ప్రతినిధులు

లోకేష్ చొరవతో విద్యా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో విద్యా సమస్యలు పరిష్కారం అవుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. విద్యార్థుల మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లు దోహదపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ మహాలక్ష్మి, హెడ్మాస్టర్ కొణతాల పద్మావతి పాల్గొన్నారు.

వేరు శనగ, మినుము విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని చిన్నప్పన్నపాలెం గ్రామంలో వేరుశనగ, మినుము విత్తనాలను మాజీ సర్పంచ్ దొండ వెంకటరమణ, దొండ లక్ష్మణమూర్తి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. రబీ సీజన్లో భాగంగా మినుము, వేరుశనగ పంటలు వేయడానికి అనువైన వాతావరణం ఉండడంతో రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్ హేమంత్, చిరంజీవి, సకల ఈశ్వరరావు పాల్గొన్నారు.

18న తపాలా అదాలత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలో ఈ నెల 18వ తేదీన 120వ తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి.సాగర్ తెలిపారు. రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు ఈనెల 15వ తేదీన ఎంవిపి బస్సు కాంప్లెక్స్ పక్కన ఉన్న పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో నిర్వహించే తపాలా అదాలత్‌లో సమర్పించాలని కోరారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్ ద్వారా చర్చించబడతాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలు, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు సమస్యలు, ఫిర్యాదులను ఈ నెల 15వ తేదీలోగా 120వ తపాలా అదాలత్ శీర్షికతో కెవిడి.సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం-530017' చిరునామాకు పంపాలని కోరారు.

స్టీల్ కంచాలు, గ్లాసులు పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 33 వ వార్డు పరిధి బంగారుమెట్ట, అల్లిపురం న్యూ మోడల్ స్కూల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న సుమారు వందమంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిమిత్తం స్టీల్ కంచాలు, గ్లాసులు, బిస్కెట్ ప్యాకెట్లను టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, భార్య తిరుమల దేవి శుక్రవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఆంధ్ర వైద్య కళాశాల రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్ కొండ శంకరరావు హాజరై మాట్లాడుతూ, సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న విల్లూరి చక్రవర్తి దంపతులను అభినందించారు. మండల విద్యాధికారి పైడపు నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలకు తరచూ సహకారం అందచేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ విల్లూరి డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ, విద్యార్థులు తాము చదువుకున్న విద్యాసంస్థకు, గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లిపురం న్యూ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎ.కనకరాజు, ఉపాధ్యాయులు వి. వినోద్, స్వరూప, ఇందిర పాల్గొన్నారు.

కంచాలు పంపిణీచేస్తున్న విల్లూరి డాక్టర్ చక్రవర్తి

'స్టాండింగ్ కమిటీ సభ్యులతో కుమ్మక్కు'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులతో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై, రూ.కోట్ల బిల్లులను అక్రమంగా ఆమోదింపజేసుకుంటున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. శనివారం జరగనున్న స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో 2005 అంశాలతో అనేక అభివృద్ధి పనులు ముసుగులో రూ.కోట్ల అవినీతికి దారి తీసే విధంగా అంశాలను అజెండాలో పొందుపరిచారని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో కూటమి ప్రభుత్వం యోగాంధ్ర నిర్వహించిందన్నారు. ఈ ఏడాది కాలంలో 12 స్టాండింగ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించినప్పటికీ, యోగాంధ్ర కోసం ఏర్పాటుచేసిన బయో టాయిలెట్స్ బిల్లుల అంశం అజెండాలో పెట్టలేదన్నారు. ఈసారి యోగాంధ్ర నిర్వహణ బయో టాయిలెట్స్‌కు అయిన ఖర్చు కింద రూ.కోటి 83 లక్షలు బిల్లు ప్రతిపాదించారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి ఎన్ని బయో టాయిలెట్లు ఉపయోగించారని ప్రశ్నించారు. బయో టాయిలెట్లు అద్దె కేవలం రూ.2500 మాత్రమే. మహా అయితే రూ.4 వేలు మించదని, అటువంటిది ఒక్కో దానికి రూ.16 వేలు అద్దె చొప్పున రూ. కోటి 83 లక్షల బిల్లు స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదించడానికి అంశం పెట్టడం భావ్యమా అని ప్రశ్నించారు. యోగాంధ్ర కార్యక్రమానికి ఎయులో ఉన్న పెద్ద రాయిని పగలగొట్టినందుకు రూ.12 లక్షలు చెల్లించే అంశం పెట్టారని, దానికి అంత ఖర్చు అవుతుందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్టాండింగ్ కౌన్సిల్లో పెడుతున్న అంశాలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్య తీసుకునే విధంగా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు చూడాలని కోరారు. కొంతమంది స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు కాసులు కోసం కక్కుర్తి పడి ఇవన్నీ ఆమోదింపజేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వానికి తాను ఫిర్యాదు చేస్తానన్నారు.

IN THE HONOURABLE
COURT OF THE CIVIL JUDGE
(JUNIOR DIVISION)
AT NARSIPATNAM
OS.No : 69/2025

Between : **Uggina Kannarao** ....Plaintiff
And : **Chandanada Appalaraju** ...Defendant

PUBLIC NOTICE

Take notice that the above named Plaintiff has filed the above Suit against you to grant the Decree for recovery of money. The Honourable Principal Junior Civil Judge Court ordered service of summons by way of paper publication. You are hereby summoned to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above suit on **19-01-2026 at 10.30 A.M.**, if failed to appear on that day, the suit will be heard and determined in your absence.

(By Court order)
K.Venkata Ramana
Advocate,
Narsipatnam
Cell : 9490060362

మహారాజశ్రీ విశాఖపట్నం ప్రధాన సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
EP 247/2023 In OS 122/2023

Karri Veera Babu ... DHR.
VS
Badidhaboyina Adi Lakshmi ... JDR.

వేలం ప్రకటన

పై నెంబర్ అమలులో DHR కు చెల్లించవలసిన అమలు బాకీ JDR చెల్లించకపోవటచే JDR యొక్క ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని 2-1-2026 వ తేదీని వేలం వేయుటకు పై కోర్టు వారు నిర్ణయించి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10:30 నిమిషముల నుండి సాయంత్రం 5 గంటలలోపు పై కోర్టులో వేలం వేయబడును. వేలం పాటలో పాల్గొదలచినవారు పై కోర్టు వారి ఇస్తిహార్ షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనవలెను.

షెడ్యూల్ ఆస్తి వివరములు

All that piece and parcel of site measuring 97 Sq. yds together with RCC building G+3floors (2and 3 are duplex) adilaxmi Nilayam, situated in bearing D.No 58-9-68, (old Assessment No 73999/391) and New Assessment No 1086257865 (one) situated at ward No 42, Karsa, covered by S.No 125/6,7 of Marripalem village, within the limits of Greater Visakhapatnam Muncipal Corporation, Visakhapatnam Sub- registrar office, Visakhapatnam, Visakhapatnam district.

Boundaries :-
East -House of Demudu in plot No 40.
North -plot No 31.
west -House of K. Mohana Rao in plot No 41.
South -15 feet wide Road.
DHR Value Rs 45,00,000/-.
Amin Value Rs 90,00,000/.

M.V.Ramakrishna Reddy.
Advocate, Visakhapatnam.
Cell : 9849357276.

స్వచ్ఛంద సేవలకు సత్కారం

స్వచ్ఛంద సేవకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- ఆనందపురం : అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవలసలో లీడర్ స్వచ్ఛంద సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవకులను సత్కరించారు. ముందుగా మదర్ తెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మేము సైతం సొసైటీ (రామవరం)ఫౌండర్ అక్కిరెడ్డి దేవుడుబాబు, వృక్ష ఫౌండేషన్ (వెల్లంకి) వ్యవస్థాపకులు కాకర సురేష్, కెవిఎస్ చారిటబుల్ ట్రస్ట్ (విశాఖపట్నం) వ్యవస్థాపకులు కోన శంకర్, గ్రామీణ వైద్యులు, సామాజిక సేవకులు (వెల్లంకి) పచ్చి పులుసు కనకారావు లను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నిస్వార్థంగా సామాజిక సేవ చేస్తున్న వారిని సత్కరించడం ద్వారా వారు ఇతరులకు ప్రేరణగా నిలుస్తారన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో లీడర్ సొసైటీ అధ్యక్షుడు జంగం జోషి పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు నిధులతో ఉన్నత పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభిస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి- ఆనందపురం : కెనరా బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెయ్యి లీటర్లు సామర్థ్యం గల ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఆరోగ్యానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న ఉద్దేశ్యంతో ఆనందపురం కెనరా బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో దీన్ని ఏర్పాటు చేశారు. ఆర్‌ఓ ప్లాంట్‌ను హెచ్ఎం కె.కామేశ్వరరావుకు బ్యాంకు విశాఖపట్నం రీజనల్ హెడ్ ఎజిఎం ఎన్.మధుసూదన రెడ్డి, డివిజనల్ మేనేజర్ హెచ్.ప్రతాప్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు ప్రతినిధులను హెచ్ఎంతోపాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి

• భీమిలి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి రాజు ఆదేశం

మండల సభలో మాట్లాడుతున్న ఎంపిపి రాజు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ప్రతి పంచాయతీకి ఆమోదించిన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎంపిపి దంతులూరి వెంకటశివ సూర్యనారాయణ రాజు స్పష్టం చేశారు.శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలోఎంపిపి అధ్యక్షతన మండల సమావేశంలో మాట్లాడుతూ, టి నగరపాలెం గోస్తనీలో తాగునీటి వనరులను అదే గ్రామానికి వినియోగించేలా, చిప్పాడ, అన్న వరం, పెద నాగమయ్య పాలెం తదితర గ్రామాలకు రక్షిత నీరు అందించేలా గతంలో చేసిన ప్రతిపాదనలు ఆచరణలో పెట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు .వైస్ ఎంపిపి ఎస్.దుర్గాలమ్మ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా అన్నవరం గ్రామంలో కొన్ని ఇళ్లకు మాత్రమే అరకొరగా తాగు నీటి కనెక్షన్లు ఏర్పాటు చేశారని, ఎర్రయ్య పాలెం గ్రామంలో పనులే పూర్తి కాలేదని సభ దృష్టికి తెచ్చారు. టి నగరపాలెం, రేఖవానిపాలెం గ్రామాల్లో జల జీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయా పంచాయతీల సర్పంచ్‌లు పొట్నూరు ఛాయా గౌతమి, ఎస్ శ్రీనివాసరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దుర్గాభవాని బదులిస్తూ తమ శాఖాపరంగా మండలంలో 77 పనులకు గాను 45 పూర్తయ్యాయని, 32 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. అసంపూర్తిగా పనులను త్వరలోనే పూర్తి చేస్తామని సభకు హామీనిచ్చారు.

-ఉద్యానశాఖ అధికారి భాను మాట్లాడుతూ, పామాయిల్, సరుగుడు, యూకలిప్టస్ పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు మండల ఎఒ బి శివ కోమలి మాట్లాడుతూ, మండలంలోని నారాయణరాజు పేట గ్రామ రైతులకు ఇనాం భూములు కారణంగానేఏ పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధి చేకూరలేదని అందలేదన్నారు.దీనిపై జెసి దృష్టికి తీసుకెళ్లాలనిఎఒకు ఎంపిపి సూచించారు. జిఒ 30 ప్రకారం ఆక్రమణలో ఉన్న స్థలాల క్రమబద్ధీకరణకు 308 దరఖాస్తులు వచ్చాయని, ప్రభుత్వ నిబంధనల మేరకు 150 గజాల వరకు క్రమబద్ధీకరించనున్నట్లు తహశీల్దార్ పైలా రామారావు తెలిపారు. ఇళ్ల స్థలాలకు 152 దరఖాస్తులు వచ్చాయన్నారు. జెడ్‌పిటిసి గాడు వెంకట ప్పడు, ఎంపిడిఒ కె వి నరసింహారావు, డిప్యూటీ ఎంపిడిఒ కె రమేష్‌నాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

రేపు వర్కింగ్ జర్నలిస్టుల వనసమారాధన

• మధురవాడ శిల్పారామం జాతరలో నిర్వహణ

ప్రజాశక్తి-సీతమ్మధార/ విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), బ్రాడ్ కాస్ట్,స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న ఆదివారం వర్కింగ్ జర్నలిస్టుల వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు,విశాఖ జిల్లా అధ్యక్షులు పి. నారాయణ తెలిపారు.. శుక్రవారం డైమండ్ పార్క్ సమీపంలో యూనియన్ కార్యవర్గ సమావేశంలో వనసమారాధన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం వనసమారాధన ఏర్పాటు చేశామన్నారు. మధురవాడ శిల్పారామం జాతరలో ఆది వారం ఉదయం 9 గంటల అల్పాహారంతో ప్రారంభమై, సాంస్కృతిక కార్యక్రమాలు, అతిథులు ప్రసంగాలు, మహిళలకు చీరలు పంపిణీ,పిల్లలకు బహుమతులు, మధ్యాహ్నం విందు భోజనం ఉంటుందన్నారు.ఆదివారం ఉదయం 9 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ప్రత్యేక బస్సు సదుపాయం ఉందని, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు వన సమారాధనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. రవికుమార్,ఎ.సాంబశివరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఇ. ఈశ్వరరావు, కార్యదర్శి కె.మదన్,మళ్ల దేవ త్రినాథ్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ ఆయా యూనియన్ కార్యవర్గ ప్రతినిధులు ప్రసాద్, కిషోర్, కామన్న, కె.వి శర్మ కృష్ణమూర్తినాయుడు, గోపాల్, పిల్లా నగేష్ బాబు, రాజశేఖర్, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ములగాడ : మతిస్థిమితం లేని వ్యక్తి మెడకు వైర్లు చుట్టుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అచ్యుతాపురంలో ఒక కాంట్రాక్టర్ దగ్గర పనిచేసే ఒడిశాకు చెందిన వ్యక్తిని మతిస్థిమితం సరిగా లేదని పనిలోంచి తొలగించారు.ఆయనను తన సొంత గ్రామానికి తీసుకెళ్లేందుకు శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో బస్సులో వెళ తుండగా, కోరమండల్ గేటు వద్ద బస్సు నుంచి దూకి పారిపోయాడు. అతనితోపాటు వచ్చిన వ్యక్తి వెంబడించి పట్టుకునే ప్రయత్నం చేయగా, దగ్గరలో ఉన్న ఇంటి మేడపైకెక్కి, మెడకు వైర్లు చుట్టుకుని కిందకు దూకేశాడు. ఈ క్రమంలో వైర్లు అతని మెడకు బిగుసుకుపోవడంతో మృత్యువాత పడ్డాడు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఏఎల్.పురం మేజర్ పంచాయతీలో శుక్రవారం మాకిరెడ్డి నాయుడు అనే వ్యక్తి విద్యుత్ ఘాతంతో గాయాలపాలయ్యాడు. ఏఎల్.పురంకు చెందిన మాకిరెడ్డి నాయుడు ఇటీవల ఇంటికి సోలార్ ను అమర్చుకున్నాడు. సోలార్ ప్లేట్లకు జియో ట్యాగింగ్ చేయడానికి ఫోటో నిమిత్తం ఆయన ఇంటి వద్ద ఉన్న రేకుల షెడ్డు పైకి వెళ్లాడు. సోలార్ ప్లేట్లకు ఫోటో తీసే క్రమంలో పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ తగలడంతో ముఖం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలో ఉన్న వారు పీహెచ్‌సికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

'స్నేహ మ్యాక్స్' నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నగరంలో 'స్నేహ మ్యాక్స్' (స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్) పేరుతో జరిగిన భారీ ఆర్థిక మోసాన్ని విశాఖపట్నం సిటీ పోలీసులు ఛేదించారు. అత్యధిక వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి, ఆ నిధులను వ్యక్తిగత ఖాతాలకు, బినామీ సంస్థలకు మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. శు క్రవారం ఉదయం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిసిపి-1 మణికంఠ చందోలు మాట్లాడుతూ, విచారణలో భాగంగా సుమారు 2,504 మంది డిపాజిటర్లకు సంబంధించి రూ.55.10 కోట్లు చెల్లించాల్సి ఉందని, నిందితులు సుమారు రూ.56.10 కోట్లను మళ్లించినట్లు అవి రికవరీ చేయదగినవిగా గుర్తించినట్లు తెలిపారు. డిపాజిట్‌దారుల నిధులను స్నేహ టీవీ, యునైటెడ్ పబ్లికేషన్స్, పృథ్వీ కన్‌స్ట్రక్షన్స్, స్నేహ ప్రియా ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి అనుబంధ, బినామీ సంస్థలకు మళ్లించినట్లు వెల్లడించారు. నిందితులపై దువ్వాడ, గోపాలపట్నం , 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయని, ఈ కేసుల్లో ప్రధాన నిందితుడు అయిన కటికల శివ భాగ్యారావును ఈ నెల 4న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మోసం చేసిన డబ్బుతో కొనుగోలు చేసిన పలు బినామీ ఆస్తులను పోలీసులు గుర్తించారు. వాటిలో ప్రధానంగా చోడవరం మండలంలో సుమారు 21.12 ఎకరాల భూమి, చిన్న వాల్తేరులో రూ.96 లక్షలు విలువ చేసే 2125 చ.అ.ల ఫ్లాట్, సీతానగర్ ప్రాంతంలో 2450 చ.గ.ల స్థలం (యునైటెడ్ పబ్లికేషన్స్ పేరుతో) ఆస్తులకు సంబంధించి లావాదేవీలను నిలిపివేయాలని (ఫ్రీజ్) కోరుతూ సబ్-రిజిస్ట్రార్లకు పోలీసులు లేఖలు పంపామని తెలిపారు.

క్రికెట్ బ్లాక్ టికెట్ల దందా

- 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : భారత్ - దక్షిణాఫ్రికా జట్ల మధ్య విశాఖ స్టేడియం వేదికగా శనివారం మధ్యాహ్నం 1.00 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించి టికెట్ల బ్లాక్ దందా మొదలైంది. తమ అభిమాన క్రికెటర్స్, జట్టును చూసేందుకు ఫ్యాన్స్ ఎంతయినా ఖర్చు పెట్టడానికి వెనుకాడకపోవడాన్ని అదనుగా భావిస్తున్న కొందరు మ్యాచ్ టికెట్లను బ్లాక్‌లో అమ్ముతూ ఆదినకాడికి దోచుకుంటున్నారు. స్టేడియం వెలుపల బ్లాక్‌లో టికెట్లు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. బ్లాక్ టికెట్లు అమ్మే 10 మందిని, కొనేవారు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కాంప్లిమెంటరీ టికెట్లు, తొమ్మిది ఆన్‌లైన్ టికెట్లు స్వాధీనం చేసుకొని పిఎం.పాలెం పోలీసులకు అప్పగించారు. వీరు రూ.1200 టికెట్ రూ.3000 వేలకు, రూ.3000 టికెట్‌ను రూ.5,500కు విక్రయిస్తున్నారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆనందపురం: గడ్డి మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి. పతివాడ రామునాయుడు (69), కుమారుడు అప్పలరాజుతో కలిసి వేముల వలసలో నివాసం ఉంటున్నారు. రాము నాయుడు ఆరు నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తగరపు వ్వలస హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. అనారోగ్యం మరింత తీవ్రం కావడంతో గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గడ్డి మందు తాగాడు. వాంతులు, విరోచనాలతో ఆరోగ్యం విషమించింది.ఇంటికి వచ్చిన భార్య అపస్మారక స్థితిలోఉన్న రామునాయుడును కుటుంబ సభ్యులతో కలిసి వెంటనే ఎన్నారై హాస్పిటల్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుడి కుమారుడు పతివాడ అప్పలరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై జి. సంతోష్

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS 183/2024

బిట్వీన్ :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లంకెలపాలెం బ్రాంచ్ ... వాది
అండ్
పేకేటి నూకరాజు ... ప్రతివాది
దావాసమును

టు,
ప్రతివాది :- పేకేటి నూకరాజు, తండ్రి నుబ్బారావు, హిందూ, వయసు 40 సంవత్సరములు. నివాసం డోర్ నెంబర్ 31-2-15/2/5. రేడియో స్టేషన్ ఎదురుగా,ఫ్లాట్ నెంబర్-201, ఎస్.జె టవర్స్, కుర్మన్నపాలెం, దువ్వాడ పోస్ట్, విశాఖపట్నం.
పై నెంబర్ దావాలో పై కోర్టు వారు పంపిన సమన్లు మీరు అందుకోనందున సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 17-12-2025 వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలెను లేనిచో మీ వర్యేక్షమందు పై దావా తీర్మానించబడును.
CH.S.S. రామచంద్రరావు, అడ్వకేట్, అనకాపల్లి.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP 88/2023 in OS 227/2022

బిట్వీన్ :
బుద్ధ నూకరాజు ...DHR
అండ్
ఎల్లపు నెహ్రూ వెంకట నాయుడు ...JDR
ఆర్డర్ 21 రూల్ 66 నోటీస్

టు,
JDR:- ఎల్లపు నెహ్రూ వెంకట నాయుడు, తండ్రి అప్పలనాయుడు, హిందూ, వయసు 53 సంవత్సరములు, డోర్ నెంబర్ 15-13-3, విల్లూరి వరదాధమయ్య గారి వీధి. నిదానం దొడ్డి, అనకాపల్లి, అనకాపల్లి జిల్లా.
పై నెంబరు అమలులో DHR గారు డిక్రీ బాకీని రాబట్టే నిమిత్తం అమలు తాలూకా షెడ్యూల్ ఆస్తిని వేలం వేయించవలసిన కోరుచూ JDR పై దాఖలు చేసి ఉంటిరి. పై నెంబర్ అమలులో JDR అయినా మీకు రూల్ 66 నోటీస్ నిమిత్తం పై కోర్టు వారు 12-12-2025 వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబర్ EP తీర్మానించబడును.
CH.S.S. రామచంద్రరావు, అడ్వకేట్, అనకాపల్లి.

మహారాజశ్రీ అనకాపల్లి 1 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA 16/2021 In OS 59/2021

బిట్వీన్
సకల గోవిందరావు ... పిటిషనర్.
అండ్
పొలిమేర సంతోష్ కుమార్ .. రెస్పాండెంట్.
నోటీస్

టు,
రెస్పాండెంట్ :- పొలిమేర సంతోష్ కుమార్. భర్త ఆదిబాబు, హిందూ, వయసు 38 సంవత్సరములు, వ్యాపారి, డోర్ నెంబర్ 13-13-2, చింతా వారి వీధి, అనకాపల్లి.
పై పిటిషన్ లో పై కోర్టు వారు పంపిన నోటీసులు మీరు అందుకోనందున సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 15-12-2025 వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయరు గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు పై పిటిషన్ తీర్మానించబడును.
పి. హర శ్రీనివాసరావు. అడ్వకేట్, అనకాపల్లి.

8 నుంచి గీతంలో 'స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్'

• వర్చ్యువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్రమోడీ

ప్రజాశక్తి- మధురవాడ : దేశంలోని యువతలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) జాతీయ స్థాయిలో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ఫైనల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇవ్వనున్నది. గీతంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలలో మరో 50 విద్యాలయాలలో, ఐఐటిలలో జరిగే ఈ స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్‌ను దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి ఈ నెల 8న వర్చ్యువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, విశాఖ నోడల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు శుక్రవారం ఆవిష్కరించారు.

గీతంలో జరిగే స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 25 విద్యార్థి బృందాలు పాల్గొనున్నాయని, 171 యువతీ యువకులు ఫైనల్ పోటీలకు హాజరవుతున్నారని విశాఖ పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తున్న గీతం విడిసి కోచ్ బి.రాజ్‌కుమార్ తెలిపారు. స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్‌లో 271 అంశాలపై విద్యార్థుల నుంచి నూతన పరిష్కారాలను, ఆలోచనలను ఆహ్వానించగా, గీతం పోటీలలో పాల్గొనే జట్లు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్), ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) కి సంబంధించిన 5 అంశాలపై పరిష్కార మార్గాలు సూచించాల్సి ఉంటుందన్నారు. న్యాయ నిర్ణేతల సమక్షంలో స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్ జట్ల ఆలోచనలను పరిశీలించి విజేతలను ప్రకటిస్తామన్నారు.

స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్ విశిష్టత

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గడచిన ఏడేళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న స్మార్ట్‌ఇండియా హ్యాక్‌థాన్ పోటీలలో పాల్గొనే విద్యార్థులకు ముందుగా కేంద్ర ప్రభుత్వం, ఇతర శాఖలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం కనుగొనాల్సిందిగా సూచిస్తారు. ఉత్తమ పరిష్కారం తెలిపే జట్లను గుర్తించి ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్-25 పోటీలలో పాల్గొనే జట్లకు 58 కేంద్ర ప్రభుత్వ శాఖలు, 15 రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, 7 ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు ఎదుర్కొంటున్న 271 సమస్యలను పరిష్కారం తెలపాల్సిందింగా సూచించారు. వివిధ రాష్ట్రాలలో నిర్వహించిన పోటీలలో విజేతలను ఎంపిక చేసి సంబంధిత జట్లను జాతీయ స్థాయిలో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఫైనల్ పోటీలకు ఎంపిక చేశారు. స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్-25 ఫైనల్ పోటీలకు దేశంలోని 60 విద్యా సంస్థలను నోడల్‌సెంటర్‌లుగా గుర్తించారు. గీతం నోడల్ సెంటర్‌లో జరిగే పోటీలకు 14 రాష్ట్రాల నుంచి 171 మంది విద్యార్థులు తరలి రానున్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ రాజేశ్వరరెడ్డి, విద్యార్థి కోఆర్డినేటర్‌లు వివేక్, అభితేజ్ పాల్గొన్నారు.

హ్యాక్‌థాన్ పోస్టరు ఆవిష్కరణలో గీతం యాజమాన్య ప్రతినిధులు

అప్పన్న సన్నిధిలో భారత క్రికెటర్లు

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న గౌతం గంభీర్, తదితరులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్న టీమిండియా పురుషుల జట్లు హెడ్ కోచ్ గౌతంగంభీర్, బ్యాటింగ్ కోచ్ నితాన్ష్ కోటక్, భారత జట్టు మాజీ మేనేజర్ పి.వెంకటరామ ప్రశాంత్ దర్శించుకున్నారు వారికి దేవస్థానం తరపున ఆలయ మర్యాదలతో ఎఇఒ కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి కెవివిఎస్ఎన్.మూర్తి, ఆలయ అధికారులు వైదిక సంప్రదాయంలో స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం, బేడా మండప ప్రదక్షిణ అనంతరం స్వామిని అంతరాయంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేదపండితులు వేదాశీర్వచనాలు అదజేయగా, ఆలయ అధికారులు స్వామి శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అందజేశారు. భారత క్రికెట్ ప్రముఖులు రాకతో వారిని చూసేందుకు భక్తులు ఎగబడ్డారు.

అలరించిన ఘంటసాల సినీ సంగీత విభావరి

ఘంటసాల గీతాలను ఆలపిస్తున్న గాయకులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : గానగంధర్వులు ఘంటసాల 103వ జయంతి సందర్భంగా మాధవధార వుడా కాలనీ ఈస్ట్ పార్కులో కెఎన్‌ఆర్ ఫ్రెండ్స్, విజయనగరం మస్తాన్ ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో ఘంటసాల సినీ సంగీత విభావరి గురు, శుక్రవారాలు రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని జెడి ఫౌండేషన్ ఉత్తరాంధ్ర పబ్లిసిటీ ఇన్‌ఛార్జి అన్నపూర్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, కేత నాగేశ్వరరావు, ఇతర గాయకులు ఘంటసాల సినీ గేయాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమానికి వి గోవిందరాజు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ, ఘంటసాల పాటలను ఆలపించారు. కార్యక్రమం ఆద్యంతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది

26 27 తేదీల్లో జ్ఞాన్ 2కె25 టెక్నికల్ ఫెస్ట్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి కళాశాలలో జాతీయస్థాయి జ్ఞాన్ 2కె25 ఫెస్ట్‌లను ఈనెల 26, 27 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఫెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. .ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవానికి వివిధ కళాశాలల విద్యార్థులకు కొత్త ప్రయోగాలు, నైపుణ్యాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు సాంకేతిక ఉత్సవంలో ప్రాజెక్ట్ ఎక్స్పో.పేపర్ ప్రెజెంటేషన్ పోస్టర్ ప్రజెంటేషన్, ఎక్స్‌పర్ట్ టాక్స్, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ సాల్వర్ కోడ్ తంత్ర ఫిన్ వంటి కార్యక్రమాలను నిర్వహించి, ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు రూ. 2 లక్షలు నగదు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను అందజేస్తారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ కన్వీనర్ డాక్టర్ ఆర్. శశిధర్, యు. రాము, శామ్యూల్ సుశాన్ పాల్గొన్నారు

కేర్‌లో విజయవంతంగా రోబోటిక్ సర్జరీలు

•18 నెలల వ్యవధిలో వెయ్యి జీర్ణకోశ శస్త్రచికిత్సలు

మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ దాస్

ప్రజాశక్తి - ఆరిలోవ : కేర్‌లో రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. 18 నెలల వ్యవధిలో అత్యాధునిక రోబోటిక్ సాంకేతిక నైపుణ్యంతో క్లిష్టమైన వెయ్యి జీర్ణకోశ శస్త్రచికిత్సలను కచ్చితత్వంతో నిర్వహించి లక్ష్యాన్ని పూర్తిచేశామని గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ బిబి దాస్ తెలిపారు.శుక్రవారం హెల్త్ సిటీలోని కర్ హాస్పిటల్‌లో మీడియాతో డాక్టర్ బిబి దాస్ మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీలతో రోగులు తక్కువ నొప్పి, త్వరితగతిన ఉపశమనం పొంది తొందరగా డిశ్చార్జికి వీలుపడుతుందన్నారు. 50 ఏళ్ళమహిళలకు సూది గుచ్చినంత పోర్టుల ద్వారా రోబోటిక్ సాయంతో పిత్తాశయము తొలగింపు, హిస్టరెక్టమి చేసామన్నారు. హెర్నియాతో బాధపడుతున్న 63 యాళ్ల రోగికి లోతైన మెష్ అమర్చామన్నారు. కీహోల్ పోర్టులతో సంక్లిష్టమైన ప్యాంక్రియాటోజేజుస్టమిని, ప్రాణాంతక ప్లీహ రక్తస్రావంతో బాధపడుతున్న15 ఏళ్ల బాలునికి స్ప్లెనెక్టమి ఆపరేషన్లను రోబోటిక్ సాయంతో విజయవంతంగా జరిపామన్నారు. కేర్ హాస్పిటల్స్ సిఒఒ సుఖేష్‌రెడ్డి మాట్లాడుతూ తూర్పు భారతదేశంలో అత్యాధునిక చికిత్స అందించడంలో కేర్ ముందంజలో ఉందన్నారు. ముఖ్యంగా అడ్వాన్సుడ్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ వైద్యానికి కేర్ ప్రధాన కేంద్రంగా ఉందన్నారు. కేర్ వైద్య బృందం డాక్టర్ దుర్గా భవాని, మెడికల్ సూపరింటెండెంట్ శోధన్ కుమార్ ఉన్నారు

కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి

• గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే గంటాకు వ్యాపారుల వినతి

ప్రజాశక్తి-భీమునిపట్నం : స్థానిక పొట్టి శ్రీరాములు కూరగాయల మార్కెట్‌లో తాగు నీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని వ్యాపారులు కోరారు. అలాగే కొత్తగా నిర్మించిన వాణిజ్య సముదాయంలో తమకు దుకాణాలు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు పలువురు కూరగాయలు, పండ్ల వ్యాపారులు వినతి పత్రం అందజేశారు .శుక్రవారం స్థానిక జివిఎంసి జోనల్ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా గ్రీవెన్స్ నిర్వహించి, వినతిపత్రాలు స్వీకరించారు. ఎండ, వానల్లో రోడ్డుపై కూరగాయలు, పండ్లు అమ్ముతూ ఇబ్బందులు పడుతున్నామనివ్యాపారుల వినతిపై ఎమ్మెల్యే గంటా స్పందిస్తూ పరిష్కారానికి అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్‌సి ఒమ్మి అయ్యప్ప నాయుడు, తహశీల్దార్ పైలా రామారావు, ఇఇ వెంకట వాసు, డిఇఇ సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంటాకు విన్నవిస్తున్న వ్యాపారులు

ఫుట్‌బాల్ ఛాంపియన్ బుల్లయ్య కాలేజీ జట్టు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈనెల 1,2 తేదీలలో నిర్వహించిన ఆంధ్ర యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ టోర్నమెంటులో డాక్టర్ లంకపల్లి బుల్లయ్యకళాశాల జట్టు ఇంటర్ కాలేజీ యూత్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి మధుకుమార్ అభినందించారు.కాలేజీ ఫైనలియర్ డిగ్రీ విద్యార్థి నవీన్ కుమార్ నాయకత్వంలో జట్టులోని క్రీడాకారులను ప్రిన్సిపాల్ డాక్టర్ జిఎస్‌కె చక్రవర్తి ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హెచ్‌ఒడి డాక్టర్ వై శ్రీనివాసరావు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్ లక్ష్మణారెడ్డి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

క్రికెటర్ కరుణకుమారికి దివీస్ సత్కారం

ప్రపంచకప్‌తో కరుణకుమారి

ప్రజాశక్తి -తగరపువలస : అంధ మహిళల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో రాణించి భారత జయకేతనంలో ముఖ్యభూమిక పోషించడం ద్వారా రాష్ట్రానికి ముఖ్యంగా ఉమ్మడి విశాఖ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేసిన క్రికెటర్ కరుణ కుమారిని దివీస్ యాజమాన్యం అభినంది ంచింది. దృష్టి మాంధ్యంతో తమ గ్రామంలోని పాఠశాలలో ఏడవ తరగతి వరకు చదివి ఆపేసిన క్రికెటర్ కరుణకుమారికి చదువుపై ఉన్న ఆసక్తిని పాఠశాల సిబ్బంది గమనించి అంధబాలికల ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. ఇక్కడ ఆటపాటల్లో కరుణకుమారి చురుగ్గా పాల్గొనేది. అయితే ఆ పాఠశాలకు రెగ్యులర్ పిఇటి లేకపోవడంతో దివిస్ యాజమాన్యం గమనించి, పిఇటిగా సత్యవతిని నియమించి విద్యార్థులకు ఆటల్లో తర్ఫీదునిచ్చారు. క్రికెట్‌పై కరుణకుమారి చూపుతున్న ఆసక్తిని గమనించిన సత్యవేణి, ఆమెకు ఆ దిశలో కోచింగ్ ఇవ్వడంతో జిల్లా,రాష్ట్రస్థాయిలో రాణించి, జాతీయజట్టుకు ఎంపికై ప్రపంచకప్ వంటి కీలకపోటీల్లో సత్తా చాటింది. దీనికి పాఠశాల యాజమాన్యం అధ్యాపక అధ్యాపకేతర బృందం, తోటి విద్యార్థులు, పిఒటి సత్యవతి కూడా తమవంతు సహకారం అందించడంతో ఇది సాధ్యమైంది. దీనిలో పాఠశాలకు పిఇటిని నియమించిన దివీస్ యాజమాన్యం తోడ్పాటు కూడా ఉంది. తమ ప్రోద్బలంతో తీర్చిదిద్దబడి, అంతర్జాతీయస్థాయిలో రాణించిన కరుణకుమారిని దివీస్ యాజమాన్యం అభినందించింది.

సంపద కేంద్రాల పరిశీలన

పారిశుధ్య నిర్వహణపై సూచనలు చేస్తున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి-పద్మనాభం : . మండలంలోని రేవిడి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి పి నారాయణమూర్తి సందర్శించారు. రేవిడి గ్రామ పంచాయతీతో సంపద కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై సూచనలు చేశారు. ఎంపిడిఒ వి..నగేష్,. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) అఖిలభారత మహాసభలు డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతున్నాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు పిలుపు నిచ్చారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక హక్కులకై నికరంగా పోరాడుతున్న సిఐటియు యూనియన్ 18వ అఖిల భారత మహాసభలు ఆంధ్ర రాష్ట్రంలో విశాఖపట్నం వేదికగా మొట్టమొదటిసారి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభకు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గం కుటుంబాలతో సహ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌తో ఈ ప్రాంత కార్మిక వర్గం భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఎదుర్కోనుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 13 గంటల వరకు పని గంటల పెంపుతో కార్మికులు తీవ్ర పని ఒత్తిడి, అనారోగ్యాలు గురి కావాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే మోడీ తెచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని అన్నారు. స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల అమలు, కనీస వేతనాలు వంటి సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించనున్నామని తెలిపారు. జిల్లాలో సంఘటిత రంగంలో ఫార్మా, ఎస్ఈజెడ్, బ్రాండిక్స్ తదితర రంగాల కార్మికులు తీవ్ర అభద్రతాభావంతో, కనీస వేతనాలు అమలు కాక ఇబ్బందులు పాలవుతున్నారని పేర్కొన్నారు. రాబోయే కాలంలో సంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమించనున్నామన్నారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు, జిల్లా నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఆర్ రాము, జి.దేవుడు నాయుడు, ఏ రాజు, ఎం నాగ శేషు, వి సత్యవతి, కే రాజేష్, పరమేశ్వరరావు, తెలయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక కార్మిక కర్షక భవనంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో కన్వీనర్‌గా కే విజయ్, కో కన్వీనర్‌గా ఎం బాలాజీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఎటువంటి ఉపయోగం లేకుండా పోతుందని వాపోయారు. ప్రభుత్వ అధికారులు విద్యార్థులను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ కాలేజీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కన్వీనర్ కమిటీని అనకాపల్లి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల నుండి తీసుకోవడం జరిగిందని, నియోజకవర్గం నుండి ఇద్దరు నాయకులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ కమిటీ నాయకులు గౌతమ్, మహేష్, శివ, మనోజ్ కుమార్, ప్రవీణ్, గణపతి, రాము, కృప, వెంకట కుమారి పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగశాల సామాగ్రి అందజేత

ప్రజాశక్తి-పరవాడ. : ఇష్కూమ్‌పేట జూనియర్ కళాశాల విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మాథమేటిక్స్ (ఎస్‌టిఇఎం) రంగాల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఎన్‌టిపిసి సింహాద్రి ముందుకొచ్చింది. తమ సిఎస్ఆర్ కార్యక్రమాల భాగంగా ఆధునిక సైన్స్ ప్రయోగశాల సామగ్రిని అందిస్తూ ఈ రంగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు ఎన్‌టిపిసి అధికారులు మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు సైన్స్ రంగంలో ఉన్న అవకాశాలను పరిచయం చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న జూనియర్ కళాశాలల్లో ప్రాథమిక సైన్స్ పరికరాల కొరత ఉన్న నేపథ్యంలో, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథం పెంపొందుతుందని అధికారులు తెలిపారు.

ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : డైట్ అటోనమస్ కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం, ఏపీఎస్ఎస్‌డిసి సంయుక్త ఆధ్వర్యంలో పీసీబీ లైవ్రైట్ సాఫ్ట్వేర్ శిక్షణ, ఈజీ ఇడిఎ (ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్) సాఫ్ట్వేర్ శిక్షణ (ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్) తయారీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు పీసీబీ తయారీ, అవసరమైన పదార్థాల ఎంపిక, డిజైన్ మేనేజ్మెంట్, సర్క్యూట్ లేఅవుట్ వంటి అంశాలను ప్రయోగాత్మకంగా నేర్చుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ మెంటర్ల మార్గదర్శకత్వంలో ఏపీఎస్ఎస్‌డిసి వంటి సంస్థలతో కలిసి సాంకేతిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. గణేష్ ప్రసాద్ రెడ్డి, కళాశాల ట్రిబుల్ ఈ విభాగాధిపతి ఎ. కృష్ణనాగ్, ట్రెనర్ జి. శిరీష, పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ ఈవోగా శ్రీధర్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం శ్రీనూకాంబిక అమ్మవారి దేవస్థానం కొత్త ఈవో, సహాయ కమిషనర్‌గా యళ్ళ శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామంలోని శ్రీదానేశ్వరి అమ్మవారి ఆలయంలో విధులు నిర్వహిస్తూ అనకాపల్లి నూకాలమ్మ దేవస్థానానికి బదిలీపై వచ్చారు. ఆయనను ఆలయ పాలక వర్గ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పాలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, పాల్గొన్నారు.

ఎండిపోయిన మర్రి చెట్టును తొలగించరూ..

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి గుడి పక్కన బస్టాప్ వద్ద భారీ మర్రిచెట్టు ఇటీవల కాలంలో పూర్తిగా ఎండిపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. అది ఎప్పుడు కూలిపోతుందోనని ఆ గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న భారీ వృక్షం ఎంతోమందికి నీడను ఇస్తూ ఉండేది. ఆ గ్రామ ప్రజలు చోడవరం, అనకాపల్లి, కే కోటపాడు ఇతర గ్రామాలకు ప్రయాణం వెళ్లాలంటే ఆ చెట్టు కింద నిలబడి ఉండేవారు. బస్సులు, ఆటోలు వచ్చేవరకు ఆ చెట్టు కింద సేద తీర్చుకునేవారు. అంతేకాకుండా ఆ గ్రామస్తులు ఆ చెట్టు నీడన కాయగూరలు, పండ్లు మొదలగు వ్యాపారాలు సాగించేవారు. ఆ చెట్టుకు ఒక పక్కన పాన్‌షాప్ నివాసం కూడా ఉంటున్నారు. ఈ చెట్టు ఎప్పటి నుంచి ఉందో ఈ తరం వారికి ఎవరికీ తెలియదని చెబుతున్నారు. అంతటి చరిత్ర ఉన్న ఈ మర్రిచెట్టు ఎండిపోయి పడిపోవుటకు సిద్ధంగా ఉండడంతో ఆ గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రయాణం కొరకు వచ్చిన కొంతమంది తెలియక మునుపటి లాగే ఆ చెట్టు కింద నిలబడుతున్నారు. ఎప్పుడు ఏ కొమ్మ విరిగి కిందన పడతాదో అని ఆ చెట్టు వైపు చూసినవారు భయభ్రాంతులకు గురవుతున్నారు. కావున ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఆ ఎండిపోయిన చెట్టును ఎవరికి ఏ ఇబ్బంది కలగకముందే తొలగించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గుల్లేపల్లి బస్టాప్ ఎండిపోయిన మర్రి చెట్టు

భూసార పరీక్షలు చేయించాలి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : రైతులు భూ సార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మోహన్ రావు అన్నారు. యలమంచిలి మండలం, పేకిలపాలెం రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అవగాహన కార్యక్రమం జరిగింది. మండలంలోని వివిధ గ్రామాలలో 746 మంది రైతుల భూమిలో గ్రామ వ్యవసాయ సహాయకులు మట్టినమూనాలు సేకరించారు. శుక్రవారం వారికి మట్టి నమూనా పత్రాలు అందజేశారు. భూసారాన్ని పెంపొందించుకోవడానికి మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించుకోవాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకొని, ప్రకృతి, ఆర్గానిక్ ఎరువులను వేసుకొని భూసారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నారాయణరావు, ఉద్యాన సహాయకులు దీపిక, గ్రామ పంచాయతీ కార్యదర్శి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ప్రజాశక్తి-కశింకోట : పిల్లలకు బాల్య వివాహాలు చేయొద్దని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. కశింకోటలో బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్త్రీ పట్ల గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో అధికారులతో బాల్య వివాహాలపై కమిటీలు ఉన్నాయి. సీడీపీఓ ప్రభావతి, శశికళ, సూపర్ వైజర్ జాన్సీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మృత్తిక దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం మార్టూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మృత్తిక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రంగాచారి మాట్లాడుతూ రైతులు నేలల సంరక్షణ రసాయన వ్యర్థాలను నేలలో కలపకూడదని, నేలల్ని సంరక్షణ చేస్తేనే మానవ మనుగడ ఉంటుందని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని తగ్గించాలని సూచించారు. పశువుల మేతకు ఎరువులు వేయొద్దన్నారు. అనంతరం గ్రామంలో రైతులకు భూసార సంరక్షణ పరీక్ష ఫలితాలు నేలల స్వభావం ఏ విధంగా ఉన్నాయో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మిద్దె రాజచంద్రరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పంచాయతీ సెక్రెటరీ రైతులు సేంద్రియ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గోరిపట్నం గ్రామంలో ముత్యాల శివ అనే యువకుడికి విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనకు చోడవరం పీహెచ్‌సిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. శివ గ్రామంలో ఎలక్ట్రికల్ పనులు చేస్తూ, పంచాయతీలో లైట్లు వేస్తూ ఉంటాడు. శుక్రవారం ఎప్పటిలాగే విద్యుత్ పనులు చేస్తూ ఉండగా విద్యుత్తు లైనుకు కరెంటు ఉండడంతో షాక్కు గురై విద్యుత్ స్తంభం పైనుండి కింద పడటంతో గాయాలయ్యాయి.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో శుక్రవారం కోటి సంతకాలు ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ హాజరయ్యారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద,వార్డు అధ్యక్షులు, జడ్పీటీసీలు, కార్పొరేటర్ లు,ఎంపీటీసీలు సర్పంచులు, వివిధ హోదాల్లో ఉన్న అనుబంధ విభాగాల అధ్యక్షులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి సమన్వయకర్త భరత్‌కుమార్

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని 19 వేల గ్రామ రెవెన్యూ సహాయకులకు కూటమి ప్రభుత్వం వెంటనే పే స్కేల్ అమలు చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. విశాఖ జిల్లాలోని అర్హులైన విఆర్ఎలతో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (విఆర్ఓ), అటెండర్, నైట్ వాచ్ మెన్ తదితర ఖాళీలను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. నామిని విఆర్ఎలను పర్మినెంట్‌గా గుర్తించాలన్నారు. రీ సర్వే పేరుతో దూర ప్రాంతాలకు విఆర్ఎలకు డ్యూటీలు వేసి టిఎ, డిఎలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. తక్షణం ఇతర డ్యూటీలు చేయించినప్పుడు పిఎం, డిఎ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి, విశాఖ అర్బన్, గాజువాక, పెదగంట్యాడ మండలాల నుండి సుమారు 60 మంది విఆర్ఎలు, విఆర్ఎల జిల్లా అధ్యక్షులు అలమండ సత్యం, డి.ముత్యాలు, పి.ఎల్లారావు, ఎ.శంకరమ్మ, దేవి పాల్గొన్నారు.

అనకాపల్లి : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విఆర్ఎలు పాల్గొన్నారు.

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్ఎలు

మాట్లాడుతున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - పరవాడ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జివిఎంసి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వార్డు పరిధిలోని లంకెలపాలెంలో డ్రై డే - ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ కోటేశ్వరరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారులకు పంపించి త్వరగా విచారణ జరిపి, తగు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రాంబిల్లి మండలం, రాజు కోడూరు గ్రామానికి చెందిన లాలం త్రిమూర్తులు కుటుంబానికి సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.56441 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొర్లి శివన్నారాయణ మూర్తి, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, లాలం శ్రీభరత్, రాజాన సూర్య నాగేశ్వరరావు, కరణం రవికుమార్, దాడి రమేష్, సేనాపతి రాజ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో బైపాస్ రోడ్డుకు ప్రతిపాదన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా అచ్యుతాపురంలో కొత్తగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రతిపాదన చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల పాఠశాలకు వెళ్లే రహదారిని అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వరకు కలిపి అక్కడ నుంచి పూడిమడక వెళ్లే ప్రధాన రహదారికి అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. ఈ మేరకు శుక్రవారం మట్టి పనులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన రహదారి నిర్మాణ పనులు పూర్తయినట్లైతే అచ్యుతాపురం జంక్షన్ లో ట్రాఫిక్ నియంత్రించవచ్చని ఆయన అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి, టిడిపి నాయకులు పుర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుండి జనసేనలో చేరిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో అచ్యుతాపురంలో శుక్రవారం వెల్చూరు సంతపాలెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే జనసేన పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో నూకన్న దొర, శ్రీనివాసరావు, శేషు, చంటి, అప్పలరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యను అభ్యసించాలి

ప్రజాశక్తి-పోడవరం : విద్యార్థినులు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్, కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలను అభ్యసించాలని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. గర్ల్స్ సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌ను స్థానిక కెజిబివి స్కూల్లో ప్రారంభించిన సందర్భంగా మార్షల్ ఆర్ట్స్ పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ లక్ష్మీ స్వరాజ్యం, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, విశాఖపట్నం జిల్లా తెక్వాండో వైస్ ప్రెసిడెంట్ పల్లం మురళీకృష్ణ, ప్రభుత్వ ఆసుపత్రి ఛైర్మన్ దేవరపల్లి వెంకటప్పారావు, ఇఒ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

12న అంగన్వాడీల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఇచ్చిన పిలుపులో భాగంగా డిసెంబర్ 12న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మికి యూనియన్ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగేశ్వ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ 42 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని తెలిపారు. పోరాట సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు ధర్నాలకు మద్దతుగా వచ్చి అధికారం రాగానే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 16 నెలల కాలం గడిచిన అంగన్వాడీల జీతాల సమస్య పరిష్కారం చేయడం లేదని వాపోయారు. ప్రభుత్వం ప్రీ స్కూలుకి ప్రైవేట్ కాన్వెంటులకు అనుమతులు ఇవ్వడంతో అంగన్వాడీలకు వచ్చే పిల్లల సంఖ్య తగ్గిపోతుందని తెలిపారు. ఒకటో తరగతి నుంచి అనుమతులున్న ప్రైవేటు స్కూళ్లు ఎల్కేజీ, యూకేజీ పేరుతో పిల్లల్ని జాయిన్ చేసుకుంటున్నారని, దీనివలన పిల్లల మానసిక ఎదుగుదలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఆటపాటలతో విద్య నేర్పుతున్న అంగన్వాడీ సెంటర్లకు నిర్వీర్యం అవుతున్నాయని, ప్రీ స్కూల్ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడి సెంటర్‌కు వచ్చే పిల్లలకు యూనిఫామ్ ఇవ్వాలని, 5జి నెట్వర్క్ సెల్ ఫోన్స్ ఇవ్వాలని, అంగన్వాడి వర్కర్ల కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.కుమారి, వరలక్ష్మి, రామలక్ష్మి, భ్రమరాంబ, తులసి, భవాని, మంగ, మహాలక్ష్మి, తులసి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

వీధి కుక్కల స్వైర విహారం

ఆందోళన చెందుతున్న ప్రజలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో గుంపులుగా తిరుగుతూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పిల్లలు చిన్నారులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మండలంలోని వడ్డాది, బంగారుమెట్ట, బుచ్చయ్యపేట, దిబ్బిడి, కేపీ అగ్రహారం, రాజాం, గున్నెంపూడి, సీతయ్యపేట తదితర గ్రామాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మనుషులపై కూడా దాడులు చేస్తున్నాయి. దీంతో మండల వాసుల కుక్కల ఊసెత్తితే ఆందోళన చెందుతున్నారు. వడ్డాదిలో వీధి కుక్క బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల పలువురు చిన్నారులను సైతం పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. దీంతో కుక్కల బెడదపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చికెన్ షాపులే వీధి కుక్కలకు అడ్డా?

వీధి కుక్కలకు ఆవాసాలుగా చికెన్ షాపులు నిలుస్తున్నాయి. చికెన్ షాపుల యజమానులు చికెన్ వ్యర్థాలను పక్కనే విడిచి పెడుతుండడంతో వ్యర్థాలను తింటూ షాపుల్లో తిరుగుతూ ఉన్నాయి. ప్రతిరోజు చికెన్ వ్యర్థాల కోసం షాపుల వద్ద గొమ్ముగూడుతున్నాయి. మండలంలోని వడ్డాది, బంగారు మెట్ట, బుచ్చయ్యపేట, రాజాం, గున్నంపూడి, సీతయ్యపేట తదితర గ్రామాల్లో గల షాపుల వద్ద కుక్కల అధిక సంఖ్యలో ఉంటున్నాయి. పంచాయతీ సిబ్బంది కుక్కల నివారణపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపై గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

అచ్యుతాపురాన్ని అనకాపల్లి డివిజన్‌లో కొనసాగించాలి

ర్యాలీలో మాట్లాడుతున్న వైసిపి నేత కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలాన్ని నూతనంగా ప్రతిపాదించిన నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలపడాన్ని వ్యతిరేకిస్తూ, అనకాపల్లి డివిజన్‌లోనే కొనసాగించాలని కోరుతూ శుక్రవారం వైఎస్ఆర్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, వైసిపి అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు. అనకాపల్లి డివిజన్‌లోనే కొనసాగించాలని, నక్కపల్లి రెవెన్యూ డివిజన్ వద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అచ్యుతాపురం మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎలమంచిలి నియోజకవర్గ కేంద్రంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పరిపాలన సౌలభ్యంగా అందరికీ అందుబాటులో ఉండే విధంగా అనకాపల్లిలోనే రెవెన్యూ డివిజన్‌ను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోన బుజ్జి, నర్మల కుమార్, కె.వెంకు నాయుడు, శనివాడ జువాల నాయుడు, గంగిరెడ్డి రాము, ఎం సూర్యనారాయణ, భీముని వెంకటేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కెజిబివిలో తూతూ మంత్రంగా పేరెంట్స్ మీటింగ్

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేజీబీవీలో పేరెంట్ టీచర్ మీటింగ్- 3.0 తూతూమంత్రంగా సాగింది. పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహించకుండా డాన్సులు ప్రసంగాలతో వెలుబుచ్చారు. విద్యార్థుల సమస్యలను చర్చించడానికి సమయం లేకుండా పోయింది. స్కూల్ అభివృద్ధి గురించి కానీ, విద్యార్థుల చదివే విధానం గురించి గానీ ప్రస్తావనకు రాలేదు. జూలై 10వ తేదీన జరిగిన పేటీఎం సమావేశంలో తల్లిదండ్రులు చెప్పిన సమస్యలను ఇప్పటివరకు నెరవేర్చలేదని పలువురు తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. మెగా పేటీఎం 3.0 పేరు పెట్టి తల్లిదండ్రుల కాలాన్ని వృధా చేస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. స్కూల్లో మెనూ సక్రమంగా లేదని పలువురు గత సమావేశంలో తెలిపిన సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం వహించారు. 280 మంది తల్లిదండ్రులు రావలసిన సమావేశానికి సుమారు 90 మంది మాత్రమే హాజరయ్యారు. స్కూల్లో యధావిధిగా మెనూ పాటించకపోవడంతో పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

మిడ్డేమీల్స్ వంట గది నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేపిడి జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారీకి అనువైన వంటశాలను నిర్మించాలని భోజన నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వడ్డాది విచ్చేసిన ఎమ్మెల్యే రాజును మధ్యాహ్నం భోజనం కార్మికులు కలిసి వినతి పత్రం సమర్పించారు. వర్షాకాలంలో వంటలు తయారు చేయడానికి ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇటు హైస్కూలు అటు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు భోజనాలను తయారు చేస్తున్నామని చెప్పారు. వంట షెడ్డు లేక ఆరుబయటే వంటలు తయారు చేస్తున్నామన్నారు. తరచూ ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రాజు విశాఖ డెయిరీ యాజమాన్యంతో మాట్లాడి వంటకు అనువైన రీతిలో రేకుల షెడ్డు నిర్మాణం చేపడతామని వారికి హామీ ఇచ్చారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట రౌతివీధికి చెందిన తోట సాయిరామ్ (46) సెప్టెంబర్ 1 నుండి కనపడటం లేదని ఆయన భార్య పూర్ణేశ్వరి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సాయిరామ్ కూలికి వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. బంధువుల వద్ద ఆరా తీసినా ఆయన ఆచూకీ లభ్యం కాలేదని తెలిపారు. దీంతో సీఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ మనోజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు కశింకోట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఏ కోడూరు గ్రామంలో శుక్రవారం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దాంతో పాటుగా రైతులకు అవసరమయ్యే వేరుశనగ, మినుములు, పెసలు మొదలగు విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం పండించిన రైతులు నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు వల్ల భూమి యొక్క స్థితిగతులు తెలుసుకోవచ్చని తెలిపారు. అనంతరం ఇటీవలే భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ అభివృద్ధి సంక్షేమ ఛైర్మన్ పీవీజీ కుమార్, కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని రావులమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో భాగంగా ఎం.జగన్నాథం, బిఆర్ నాయుడు సహాయ సహకారాలతో 20వేల రూపాయలు విలువగల మైక్ సెట్‌ను గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపిటిసి చొక్కాకుల గోవింద చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు అరుణకుమారికి అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అప్పారావు, పాఠశాల కమిటీ ఛైర్మన్ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పేరెంట్, టీచర్ సమావేశాలు

చీడికాడలో ప్రశంసాపత్రాలు ఇస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గొలుగొండ:విద్యార్థులకు తల్లిదండ్రులే ఆది గురువులని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం జోగుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను నేర్పాలని చెప్పారు. విద్య అంటే మార్కులనే కొలమానం కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు వంటి అంశాలను ప్రామాణికగా బోధన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిటికెల తారకవేణుగోపాల్, మాజీ టిడిపి అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, జనసేన మండల అధ్యక్షులు గండెం దొరబాబు, ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులతో పాటు సర్పంచ్ జువ్వల లక్ష్మీ, విద్యా కమిటీ చైర్మన్ గుడివాడ మురళీ, ఎంఇఒలు సత్యనారాయణ, కృష్ణప్రసాద్, ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ తహశీల్దార్ రామారావు, మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి పాల్గొన్నారు.

పాతకృష్ణదేవిపేట ఎంపిపి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అప్పన దొరబాబు డ్రింకింగ్ వాటర్ సమస్య కొరకు రూ.2వేలు విరాళంగా అందజేశారు.

పాయకరావుపేట:పట్టణంలోని సమయమంతుల రెడ్డి జెడ్‌పిహెచ్ స్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్‌లో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడటంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. నియోజకవర్గంలో పదో తరగతి చదువుతున్న ఆడ, మగ విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 10వ తరగతి విద్యార్థుల ఫీజును తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

నక్కపల్లి:ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ శుక్రవారం మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాన్ని ఎంఈఓలు కె నరేష్, నాగన్న దొర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను అందంగా ముస్తాబు చేశారు.

పాయకరావుపేట: స్థానిక కనోస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో మెగా పేరెంట్స్ సమావేశం స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ సంతాన జాన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్రిస్టియన్ విభాగ అధ్యక్షులు సామాజిక కార్యకర్త నెలపర్తి నాగేశ్వరావు మాట్లాడుతూ, పిల్లలు బాగుపడాలంటే తల్లిదండ్రులే ప్రముఖమైన పాత్ర పోషించాలన్నారు. సచివాలయ మహిళా పోలీస్ బుల్లా రాణీ, సంతాన థామస్ హెడ్ మిస్ట్రెస్, సిస్టర్ వేణి కలమాట పాల్గొన్నారు.

చీడికాడ:మంచాల ఆదర్శ పాఠశాల కాలేజీలో శుక్రవారం మెగా పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల కాలేజీ స్కూల్ కమిటీ చైర్మన్ నారాయణమూర్తి, వైస్ చైర్మన్ మంగమ్మ దేవుడి నాయుడు, ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి స్కూల్ సిబ్బంది పెద్దలు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలో గుంటపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశం గ్రామ సర్పంచ్ గెద్దం సుజాత కన్నబాబు ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమం లో జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి పల్లి దుర్గారావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగం చిన్న పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్: మండలంలోని వేములపూడి స్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ ఆధ్వర్యాన నిర్వహించారు. ముఖ్య అతిథి బోలెం రాంప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధే ప్రభుత్వం ప్రధాన కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని గొల్లలపాలెం కెజిబివిలో శుక్రవారం మెగా పేరెంట్స్ డే సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గం స్పెషలాఫీసర్ ఆశాదేవి, ఎంపిడిఒ సాంబశివరావు, తహశీల్దారు భుజంగరావు, ఎంఇఒలు కె.సత్యనారాయణ, ప్రసాద్, కెజిబివి ప్రిన్సిపల్ చిన్నమ్ములు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట డిపిఎన్ హైస్కూల్లో మెగా పేరెంట్స్ డే జరిగింది. మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ సుభాషిణి మాట్లాడారు. ఎంపిడిఒ చంద్రశేఖర్‌రావు, సీఐ స్వామి నాయుడు, కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీను, హెచ్‌ఎం ప్రసాద్‌రావు పాల్గొన్నారు. తాళ్ళపాలెం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఉల్లింగల రమేష్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని మునగపాక, మూలపేట, అరబుపాలెం, తిమ్మరాజుపేటతో పాటు పలు గ్రామాల్లోని పాఠశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు ఘనంగా జరిగాయి. వైసిపి నాయకులు బొడ్డేడ ప్రసాద్, గంగ అప్పలనాయుడు, భీమిశెట్టి మంగ లక్ష్మి, బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంఈఓ వేణుగోపాల్, హెచ్‌ఎంలు ఎం శ్రీనివాసరావు, అప్పారావు, కోటేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్లు ఆడారి సూరిచంద్ర రామారావు, కర్రి కృష్ణ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాలు ఘనంగా నిర్వహించారు. దిబ్బిడి హైస్కూలు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. జడ్పిటిసి దొండా రాంబాబు, పెదరెడ్ల మాణిక్యం, గోంప చినబాబు, గోన్నాబత్తుల శ్రీనివాసరావు, సేనాపతి శ్రీను, హెచ్‌ఎం సత్య రావు పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : మండలంలోని ఏటికొప్పాక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన ఉపాధ్యాయ తల్లిదండ్రుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి రాజాన శేషు, ఎంపీడీవో కొండలరావు, స్పెషలాఫీసర్ సందీప్, ఎంఈఓ సూర్యప్రకాష్, ఐసిడిఎస్ పిఒ ఇందిరా దేవి, గ్రామ సర్పంచ్ కె లక్ష్మి పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్ టీచర్ ఆత్మీయ సమావేశాలు జరిగాయి. స్థానిక మెయిన్ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొని మాట్లాడారు.

పరవాడ : మండలంలోని తానాం ఎంపిజెపిఎబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమామోహిని, మాజీ జెడ్‌పిటీసీ పైల జగన్నాథరావు, టిడిపి పరవాడ మండల అధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, ఉప సర్పంచ్ వి.మంగలక్ష్మి, రొంగల లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పరవాడలో...

సబ్బవరం : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలలో మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశాలు జరిగాయి. ఆరిపాక జెడ్‌పి హైస్కూల్లో ఎంఈఓ-2 ఎంజె రవీంద్రబాబు, కెజీబీవీలో ప్రిన్సిపాల్ మృదుల, సబ్బవరం గవర్నమెంట్ పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.తిరుపతిరావు, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సిహెచ్.కేశవరావు, గోటివాడ ఎంపిపి పాఠశాలలో హెచ్‌ఎం పివి. ఆనంద్ ఆధ్వర్యాన జరిగాయి. మల్లునాయుడుపాలెం హైస్కూల్‌లో ఎ పి కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో కేఏడి జెడ్పీ హైస్కూల్లో పేరెంట్ టీచర మీటింగ్‌లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పద్య పఠనం, ఇంగ్లీష్ స్పీచ్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసన్న కళ, ఎస్ఎంసి చైర్మన్ కోవెల వెంకటరమణ, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, వైస్ ఎంపిపి దొండా లలిత, హైస్కూల్ స్థల దాత కుమారుడు కోవెల జనార్దనరావు, ఎంపిటిసీలు ఇంటి అప్పారావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్స్ జరిగాయి. తెనుగుపూడి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజ్, ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎంఈఓలు సిహెచ్ ఉమా, ఉషారాణి, ప్రిన్సిపాల్స్ రాధా, విక్టర్ పాల్, కెజిబివి ఎస్ఓ సిహెచ్.భువన మాధురి, ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, టీడీపి మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి మండలం సిరసపల్లి జెడ్‌పి హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మామిడిపాలెంలో హెచ్‌ఎం శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్ తల్లిదండ్రులు తిలకించారు. తుమ్మపాల హైస్కూల్లో కమిటీ చైర్మన్ శెట్టి బలరాం, చదరం నాగేశ్వరరావు, కర్రి బాబీ, సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు పాల్గొన్నారు. ఏఎంఏఎల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ గల్లా జయబాబు అధ్యక్షతన జరిగింది.

సీతమ్మధార : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు.అక్కయ్య పాలెం ఎన్జీవోస్ కాలనీ జివిఎంసి హైస్కూల్లో మెగాపేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, డిఇఒ ప్రేమ్ కుమార్ స్థానిక టిడిపి కార్పొరేటర్‌శ్రావణి పాల్గొన్నారు. 25వ వార్డు మధురనగర్ హైస్కూల్లో స్థానిక కార్పొరేటర్ సారిపల్లి గోవిందు ముఖాముఖి నిర్వహించారు

భీమునిపట్నం : సంస్కరణలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందనిఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కళాశాల, ఉన్నత పాఠశాల తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పాఠశాల కమిటీ చైర్మన్ గైర్హాజరుతోపాటు తల్లిదండ్రుల హాజరు తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఎంసి చైర్మన్‌ను తొలగించి వేరొకరిని నియమించాలని ఆదేశించారు. కాలేజీ ప్రిన్సిపాల్ పి రామ్ ప్రసాద్,ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి రమణ, జెడ్‌పిటిసి గాడు వెంకట ప్పడు,తహశీల్దార్ పైలా రామారావు, జెడ్సి ఒమ్మి అయ్యప్ప నాయుడు, ఎంఇఒలు శివ రాణి, ఎ.జయప్రద పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో భవిత కేంద్రం విద్యార్థులకు జగదీష్ మాస్టర్, అతనిసతీమణి జ్యోతి సొంత నిధులతో ప్లేట్స్, గ్లాసులు వితరణ చేశారు. విద్యార్థి మజ్జి భవాని శంకర్ తల్లిని సత్కరించారు. మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ హైస్కూల్లో, కేజీబీవి. ఏడు మోడల్ స్కూళ్లలో మెగా పిటిఎంల్లో ఎంపిపి రాంబాబు పాల్గొన్నారు.

గొలుగొండలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తగరపువలస : భీముని పట్నం మండలం తాటితూరు, రాజుల తాళ్లవలస, చిట్టివలస, లక్ష్మీపురం జెడ్‌పిహెచ్ఎస్‌లు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జివిఎంసి ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తాటితూరులో దాత కోట మహంతి వెంకటాచలం 253 మంది విద్యార్థులకు రూ.13 వేలు ఖర్చులతో ఐడి కార్డులు అందజేశారు ఎంపిపి డిఎన్ రాజు, ఎంపిటిసి కోరాడ రమణ, కార్పొరేటర్ అక్కరమాని పద్మావతి, సర్పంచ్ సిరిగిడి ఈశ్వరరావు సంతోష్ ,హెచ్‌ఎంలు డి..శ్రీనివాసరావు, ఏ.రమేష్ కుమార్, డి ఆదినారాయణ, వైఎస్‌విపిడిజె స్వామి, దంతాశెట్టి సత్య రావు పాఠశాల కమిటీ చైర్మన్లు చిట్టిబాబు, వరలక్ష్మి, పరిమి, భువనేశ్వరి, తమ్మిన సూరిబాబు, ఎం శంకర్రావు పాల్గొన్నారు.

మధురవాడ : పిలకావని పాలెం, చంద్రంపాలెం, వాంబే కాలనీ,మల్లయ్య పాలెం, స్వతంత్ర నగర్,చంద్రంపాలెం హై స్కూల్స్ లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ పిళ్ళా వెంకటరావు, కానూరు అచ్యుత్, నాగోతి సూర్య ప్రకాష్,పాల్గొన్నారు.

ములగాడ : 40వ వార్డు ఏకేసీ కాలనీ, సింధియా, న్యూ కాలనీ, వివిధ స్కూళ్లల్లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

ఆర్ ఆర్ రాజు. శివశంకర్ పాల్గొన్నారు. 58 వ వార్డు శ్రీహరిపురం హైస్కూల్ లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ విప్ పి.గణబాబు పాల్గొన్నారు. నిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా,. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ఎకడమిక్ కోఆర్డినేటర్ శ్రీ జగన్నాథం పాల్గొన్నారు.

ఆనందపురం :వెల్లంకి పంచాయతీ గొరిపేటలోని ఎంపిఇ పాఠశాల హెడ్‌మాస్టర్ జి. గంగాధరుడు అధ్యక్షతన మెగా పిటిఎం సమావేశంలో సర్పంచ్ కొప్పాడ లక్ష్మణరావు ఎంపిటిసి అప్పలనాయుడు పాల్గొన్నారు. కెజిబివిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ఎంపిటిసి రౌతు శ్యామల, సర్పంచ్ లోడగల రాజేశ్వరి, మండల ప్రత్యేక అధికారి కే. రామారావు, సమగ్రశిక్ష ఎపిసి డాక్టర్ జోగి చంద్రశేఖరరావు, జిసిడిఒ శ్రీదేవి, ఎంఇఒలు జోగేంద్రనాథ్, గంగరాజు, ప్రిన్సిపల్ బి. నాగమణి ,వృక్ష ఫౌండేషన్ ఫౌండర్ సురేష్ కుమార్, జెడ్‌పిటిసి ఉమాదేవి,

స్కూల్‌కమిటీ చైర్మన్ కోరుకొండ శివాజీ పాల్గొన్నారు

పెందుర్తి : పిఎంశ్రీ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ 3.0లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఎంఇఒ సువర్ణ, మధుమూర్తి, హెచ్‌ఎం చిన్నయి, పిఎసిఎస్ చైర్మన్ అయిత సింహాచలంనాయుడు పాల్గొన్నారు. పురుషోత్త పురం ప్రాథమిక పాఠశాలలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, 94వ వార్డు టిడిపి అధ్యక్షులు చీర అప్పలరాజు 94వ వార్డు టిడిపి అధ్యక్షులు చీర అప్పలరాజుపాల్గొన్నారు.

కొమ్మాది : 5వ వార్డు బొట్టవానిపాలెం,నగరంపాలెం, రాజీవ్ గృహకల్ప, మారికవలస,బోరవానిపాలెం, పరదేశిపాలెం లలో ప్రభుత్వ మండల ప్రాథమిక పాఠశాలలు, మధురవాడ చంద్రంపాలెం ఉన్నత పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో కార్పొరేటర్ మొల్లి హేమలత పాల్గొన్నారు. .కార్యక్రమంలో నాగోతి సత్యనారాయణ, నాగోతి అనిత పాల్గొన్నారు.

ఆరిలోవ : తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజ శేఖర్, ఒమ్మి సన్యాసిరావు పాల్గొన్నారు. గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో రాగతి అచ్యుతరావు, ముగడ రాజారా పాల్గొన్నారు.

కారిడార్ పనులు పరిశీలించిన యువరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూముల్లో పరిశ్రమల స్థాపన కోసం చేపడుతున్న పనులను రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ యువరాజు పరిశీలించారు. శుక్రవారం ఆయన పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించారు. పరిశ్రమల స్థాపన కోసం మౌలిక వసతులు కల్పనలో భాగంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణాలు, ఇతర పనులను పరిశీలించారు. భూసేకరణ ప్రభావిత గ్రామాలకు సంబంధించి అనుసంధానం రోడ్లు, కారిడార్ రోడ్డు పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సబ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి బౌండరీస్ ఏరియాను పరిశీలించారు. మ్యాప్ ను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి సి అనిత, ఏపీఐఐసీ జనరల్ మేనేజర్ నరసింహారావు, తహసిల్దారు నరసింహామూర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మ్యాపును పరిశీలిస్తున్న యువరాజు

అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి- రావికమతం:రావికమతం మండలం గర్నికం కస్తూరిబా పాఠశాలలో శుక్రవారం బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో రావికమతం ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు. మేజర్ అయ్యేంత వరకు బాల్య వివాహాలు చేయకూడదన్నారు.బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయన్నారు.బాల్య వివాహంతో పుట్టిన బిడ్డలుకు అంగవైకల్యం ఏర్పడటం, తల్లి బిడ్డ ఆరోగ్యం సరిగా లేకపోవడం వంటివి కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

పాఠశాల విద్యా కమిటీ ఎన్నిక

చైర్మన్‌గా లోవకుమార్

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సీహెచ్.నాగాపురం ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. ఇందులో చైర్మన్‌గా జుర్రా లోవకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంకు హాజరైన సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు మాట్లాడుతూ పాఠశాల అవసరాలను సమగ్రంగా అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తనిఖీ చేపడుతున్న అప్పన్న

స్కూల్ బస్‌ల తనిఖీలు

ప్రజాశక్తి మాడుగుల:పాఠశాల విద్యార్థులను తరలించే వాహణాల రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ అప్పన్న హెచ్చరించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాలల్లో విద్యార్థులను తరలించే వాహణాల కండిషన్ ఏవిధంగా ఉంది రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా, డ్రైవర్లు అనుభవం కలిగినవారిని నియమించారా లేదా అన్నదానిపై తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం మాడుగుల కేంద్ర లో సెయింటన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులను తరలించే నాలుగు బస్సులను తనిఖీ చేశారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో స్పెషల్ డ్రైవ్ చేస్తామని అప్పన్న తెలిపారు.

మట్టి నమూనాల ఆధారంగా ఎరువులు వాడాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:మట్టి నమూనాల విశ్లేషణ ఆధారంగా సమతుల్యమైన ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి తులసీమణి రైతులకు సూచించారు. మండలంలో దోసలపాడు, గుల్లిపాడు, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా పర్యటించారు. వరి పంట పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంటలకు సిఫార్సు చేసిన ఎరువులను మాత్రమే వాడాలని సూచించారు.ఆరోగ్యకరమైన నేల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఇంచార్జి వ్యవసాయ అధికారి శ్రీనివాస్ ఆహార భద్రత, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలు వంటి వాటి గురించి వివరించారు. రైతులకు సూక్ష్మ పోషకాలు జింక్ సల్ఫేట్ అవశ్యకత, ఉపయోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు సత్యనారాయణ, సాయి కుమారి, వ్యవసాయ సహాయకులు శిరీష, లావణ్య, ప్రశాంతి, వందన, రూప రైతులు పాల్గొన్నారు.

రావికమతం: గ్రామంలో వ్యవసాయ రైతులందరూ భూసార పరీక్షలు నిర్వహించు కోవాలని అనకాపల్లి జిల్లా వనరుల సహాయ సంచాలకులు ఝాన్సీ తెలిపారు. రావికమతం మండలం చినపాచిల రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు భూసార పరీక్షలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రెండు ఏళ్ళకు ఒక మారు రైతులు పంట భూముల్లో మట్టిని వ్యవసాయ అధికారుల ద్వారా ల్యాబ్‌కు పంపించి భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. దీంతో భూమిలోనే ఉన్న పోషక విలువలను, వాటి స్థాయిని తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షల ద్వారా భూమికి కావలసిన పోషక విలువలను ఎంత మోతాదులో అందించాలో అన్న విషయాన్ని రైతులు తెలుసు కోవడానికి ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమేష్ బాబు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

నక్కపల్లి, రావికమతంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఘనంగా టిడిపి నేత రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- నక్కపల్లి:ఉపమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్, టిడిపి నేత చిలువూరి రామ సూర్యనారాయణ రాజు (పెంకుల రాజు) జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నక్కపల్లిలోని టిడిపి కార్యాలయంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో సూర్యనారాయణ రాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.నక్కపల్లిలో ఆయన స్వగృహం నందు కూడా పలువురు నాయకులు, అభిమానులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

శ్రీనుకు ఘన సత్కారం

ప్రజాశక్తి: -రావికమతం: రావికమతం మండలం వీఆర్వోల సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన ఆసరి శ్రీనును శుక్రవారం మేడివాడలో రావికమతం ఎంపీపీ పైలరాజు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముక్కా మహాలక్ష్మి నాయుడు, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్మడి దేవ, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, గంటా ఈశ్వరరావు, జడ్పిటిసి ఆదిమూర్తి, మేడివాడ మాజీ కోపరేటివ్ అధ్యక్షులు కుంచంగి కోటేశ్వరరావు, పాండు తదితరులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ పైల రాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముక్కా మహాలక్ష్మి నాయుడులు మాట్లాడుతూ, శ్రీను మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయన మంచితనానికి ఇదే నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్డిప సర్పంచ్ గుమ్మాల గణేష్, వరహాలు పాల్గొన్నారు.

విఆర్‌ఒల సంఘం అధ్యక్షులు శ్రీను సత్కరిస్తున్న నాయకులు

పరామర్శిస్తున్న అనిత

హోం మంత్రి అనిత పరామర్శ

ప్రజాశక్తి-పాయకరావుపేట:పాయకరావుపేటలో టీడీపీ సీనియర్ నాయకులు కొండబాబు కుమారుడు శివను రాష్ట్ర హెూం మంత్రి అనిత శుక్రవారం పరామర్శించారు. షుగర్ తీవ్రంగా పెరగడంతో శివ ఆరోగ్యం దెబ్బతినగా, వైద్యులు ఆయనకు కాలి తొలగింపు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ నేపథ్యంలో శివను పరామర్శించి హోం మంత్రి అనిత, ఆపదలో పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. శివ త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

ఆర్చరీ క్రీడాకారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ శుక్రవారం తన ఛాంబర్ లో అంతర్రాష్ట్ర సీనియర్ ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్న క్రీడాకారులకు ఈ సాయం అందించడం ద్వారా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి కలెక్టర్ చొరవ చూపారు. ఈ అంతర్రాష్ట్ర సీనియర్ ఆర్చరీ పోటీలు ఈ నెల 11, 12 తేదీలలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో నిర్వహించనున్నారు. కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచి, జిల్లాకు, రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆర్థిక సహాయం అందుకున్న క్రీడాకారులను జిల్లా కలెక్టర్ తో పాటు, డిఎస్డిఓ, ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

ఆర్థిక సహాయం అందిస్తున్న అల్లూరి జిల్లా కలెక్టర్